# బాస్

"ఏమిటిది సుభాష్? ఇంత సర్వీసు, అనుభవం ఉన్న మీ నుండి ఇలాంటి పని ఎక్స్పెక్ట్ చేయలేదు" మా రీజినల్ మేనేజర్ కేబిన్‌లో అడుగుపెట్టానో లేదో, అక్షింతల వర్షం కురిసింది.

"ఏమయింది సార్? ఏ పని గురించి మీరు మాట్లాడేది?"

"ఇంకా ఏం కావాలి? పోయిన నెల మీరు చేసిన ప్రియారిటీ సెక్టర్ స్టేట్‌మెంట్ గురించి చూడండి. జి.ఎం. గారు ఎంత స్ట్రాంగ్ గా రాసారో? ఏదైనా స్టేట్‌మెంట్ తయారుచేశా క్రాస్ చెక్ చేయకపోతే ఎలా?"

"అది మీరు సూచించినట్టుగానే తయారు చేశాను సార్! మీరు చెక్ చేశారు కూడా అందులో నా తప్పేముంది?" కాస్త ఘాటుగానే అన్నాను.

"మీ తప్పేం లేదు! మీకు ఆ పని అప్పగించడం నా తప్పు. సరే! వెంటనే ఇ రెక్టిఫై చేసి ఇవ్వండి. సవరించిన స్టేట్‌మెంట్‌తో పాటు నా సంజాయిషీ ఇవ్వాలి. మీ పేర రిపోర్టు చేయక తప్పదు!"

ఉక్రోషం వచ్చింది. కానీ స్థాన బలిమి కదా!

ఏమనలేక నా సీటు దగ్గరికి వచ్చాను.

నా మనసు కుతకుత లాడుతోంది.

" రీజనల్ మేనేజర్‌గా తన బాధ్యతేం లేదు. కాని. గుమస్తాగా నాది తప్పట! పేర రిపోర్టు చేస్తాడట! చేయనీ నాకేం భయమా? మా యూనియన్ లేదూ?

నాకు మెమో రానీ, అప్పుడు చూస్తాను. ఈయన మార్పులు చేసిన చిత్తు కాపీ న దగ్గర భద్రంగా ఉంది.! అది హెచ్.ఓ.కు పంపితే నా తడాఖా తెలుస్తుంది."

నెల క్రితం జోనల్ మేనేజర్ వచ్చినప్పుడు...

"అన్నిట్లోకి మీ రీజన్ ప్రాఫిట్ ప్లాన్ చాలా బాగుందండీ. చాలా పకడ్బందీగ తయారు చేసారు. కంగ్రాచ్యులేషన్స్" జోనల్ మేనేజర్.

"దాందేముంది సార్ ఇన్ని సంవత్సరాల అనుభవం అక్కరకు వచ్చింది." నక్క వినయం ప్రదర్శించాడు రీజనల్ మేనేజర్.

"అనుభవం అందరికీ ఉంటుందండీ! మీలా కార్పోరేట్లను అర్థం చేసుకునే దెంతమంది?"

"థ్యాంక్యూ, ఫర్ ది కాంప్లిమెంట్ సార్!"

నిజానికి ఆ ప్రాఫిట్ ప్లాన్ తయారు చేసింది నేను. దాంట్లో ఎవరి ప్రమేయమ లేదు. కానీ నా పేరు జోనల్ మేనేజర్‌కి చెప్పాడా?

లేదు. అంతా తన ప్రతాపం అన్నట్లు ఫోజు కొట్టాడు.

ఇప్పుడు? హెడ్ ఆఫీసు నుంచి శ్రీముఖం వస్తే నా పేరు రిపోర్టు చేస్తాన బెదిరింపు! క్రెడిట్ తనకి డెబిట్ క్రింది ఉద్యోగులకి!

ఈ ఆఫీసర్లంతా ఇంతే!

అన్యమనస్కంగా ఇంటికి వచ్చాను.

కాఫీ ఇస్తూ శ్రీమతి "చూశారా మన రోహిణీ మళ్ళీ లెక్కల్లో తప్పింది"

ఇంకా ఆఫీసు హేంగోవర్లోనే ఉన్న నాకు అగ్గిలో ఆజ్యం పోసినట్లయింది.

రమ మీద విరుచుకుపడ్డాను.

" తప్పక ఏం చేస్తుంది? నీకు పిల్లలపై శ్రద్ధ ఉంటేగా! టిఫిన్ బాక్స్, వాటర్ బ్యాగ్ ఇచ్చి స్కూలుకు పంపగానే సరికాదు. బి.ఎ. చదివిన దానివి ఇంట్లో కూర్చొని ఆ మాత్రం చదువు చెప్పకపోతే ఎలా?"

"కిరీటికి చెప్పటం లేదా? వాడు బుద్ధిగా చదువుకుంటున్నాడు? కానీ రోహిణీ, అది మీ గారాల పట్టి కదూ? నేను కొడితే దాన్ని వెనకేసుకొచ్చేది మీరే కదా! అయినా పరీక్షలప్పుడు దానికి లెక్కలు నేర్పింది మీరు కాక నేనా?" రమ ఏమీ తక్కువ తినలేదు.

"అంటే నేను లెక్కలు నేర్పడం వల్ల అది ఫెయిలయ్యిందా? లెక్కల్లో నాకు నూటికి నూరు మార్కులొచ్చేవి తెలుసా?"

"తెలుస్తూనే ఉంది మీ తెలివి! అప్పుడప్పుడూ నన్ననడం మీ కలవాటేగా!"

ఇక లాభం లేదు. అస్త్ర సన్యాసం చేయాల్సిందే.

రూటు మార్చేను.

"మన కిరీటి రిజల్ట్ మాటేమిటి?"

"బాబుకేం ఎనభై ఆరు శాతం మార్కులొచ్చాయి. క్లాసులో సెకండ్ ర్యాంక్" లేని కాలర్‌ని ఎగరేసింది.

"ఎంతయినా వాడు 'నా' కొడుకు కదా!"

"అవును నవమాసాలు మోసి కన్నారు! రోజూ మీరే చదువు చెప్పారు. మరి అమ్మాయి?"

"అమ్మాయి... మనమ్మాయేగాని దానికి నీ బుద్ధులే వచ్చాయి." ఉడికించాను.

"బాగుందండీ వరుస. అబ్బాయికి మంచి మార్కులు వస్తే అది మీ ప్రతాపం! అమ్మాయి ఫెయిలయితే నా తప్పు. అంతేనా? మీ మగాళ్ళంతా ఇంతే!"

నా నోటికి తాళం పడింది.

ఇంట్లో నేను బాసునే ...

కాని

ఒక్కోప్పుడు స్థాన బలిమి కంటే తన బలిమిదే పై చేయి అవుతుంది.

సడన్‌గా మా బాస్ జ్ఞప్తికి వచ్చాడు!

బాస్ లంతా ఇంతే!

అందరిదీ ఒకే మనస్తత్వం. ★